సాక్షి జగిత్యాల

శనివారం । 5 । ఆగస్టు । 2023



సప్తాహ ప్రవచనాలు

జగిత్యాలజోన్: వాసవీ గార్డెన్‌లో ప్రవచకుడు సంతోష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు శుక్రవారం కూడా కొనసాగాయి.



నిబంధనలు గాలికి..

జగిత్యాల : జిల్లాలోని కొందరు రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. నాసిరకం ఆహార పదార్థాలు వడిస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అసెంబ్లీలో సంజయ్ గళం



ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: వైద్య అవసరాలను తీర్చేది దేశంలో తెలంగాణనే అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం చేపట్టిన క్వశ్చన్ అవర్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. వైద్యంలో నూతన శకం ఆరంభమైందన్నారు. ప్రతీజిల్లాకు మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు ద్వారా సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందుతోందని పేర్కొన్నారు. వరంగల్‌లో 2,400 పడకల ఆస్పత్రి ఏర్పాటు ద్వారా ప్రజలకు చాలా మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. రాష్ట్రంలోని వైద్యసేవలపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా ప్రసంగించారు.

పారిశుధ్యంపై దృష్టి



గుడిసెవాసుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై దృష్టి సారించాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందంలోని సభ్యులు అయ్యాస్, శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు ఇంటింటా పర్యటించారు. తొలుత మహిళా సంఘాల సభ్యులు బతుకమ్మలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం సభ్యులు గ్రామంలోని వైకుంఠధామం, వర్మికంపోస్ట్ షెడ్డు, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగం, వృథా నీటి వినియోగంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వృథా నీటిని ఇంకుడుగుంతల్లోకి మళ్లించాలని సూచించారు. తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు నరేశ్, శివాజీ, ఎంపీడీవో శైలజరాణి, ఎంపీవోలు సలీం, రవిబాబు, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల అసెంబ్లీ ముట్టడి భగ్నం



పోలీసుల అదుపులో ఏఎన్‌ఎంలు

జగిత్యాలక్రైం: షరతులు లేకుండా తమ సర్వీసులనూ క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సెకండ్ ఏఎన్ఎంలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. బీర్‌పూర్, జగిత్యాల, వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ పలువురు ఏఎన్‌ఎంలను అరెస్ట్ చేశారు. నాయకులు మధురిమ, పడాల మమత శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, 16ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న(పురుష) హెల్త్ అసిస్టెంట్లను షరతుల్లేకుండా రెగ్యులరైజ్ చేశారని, అదే విధంగా తమతోపాటు హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ డిమాండ్లను చాలాసార్లు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలకు విన్నవించినా ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. మోతె చెరువు వద్ద శుక్రవారం ఆయన హరితహారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తేనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్‌బాబు, కౌన్సిలర్లు నవీన్, జగదీశ్, హరీశ్, రాంకుమార్ పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు



కోరుట్లకు చెందిన ఇతడి పేరు గంగరాజం. కులం, ఆదాయం, నివాసం తదితర ధ్రువీకరణ పత్రాల కోసం ఏటా సుమారు మూడు కిలోమీటర్లకు పైగానే ప్రయాణం చేసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకునేవాడు. ఆఫీసుకు వెళ్లగానే పనిపూర్తయ్యేది కాదు. ఒకటికి నాలుగుసార్లు వెళ్లవస్తేనే సర్టిఫికెట్లు చేతికి వచ్చేవి. ద్విచక్రవాహనం లేనివాళ్లు కనీసం రూ.100వరకు వెచ్చించి ఆటోలో వెళ్లాల్సి వచ్చేది. దాదాపు పాతికేళ్లుగా పట్టణవాసులు ఇలాంటి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. కానీ, సుమారు పదిహేను రోజుల క్రితం ఎస్సారెస్పీ క్వార్టర్ల ఖాళీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇది అందుబాటులోకి వస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందని గంగరాజం సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అతిథులు(ఫైల్)

- కోరుట్ల పట్టణ నడిబొడ్డున తహసీల్దార్ కార్యాలయం
- 15రోజుల క్రితం భవన పనులకు భూమిపూజ
- తప్పనున్న పట్టణవాసుల పాతికేళ్ల తిప్పలు

కోరుట్ల: పట్టణ శివారు మద్దుల చెరువు సమీపంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎకరం స్థలాన్ని 1998లో విరాళంగా ఇచ్చారు. అందులో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల భవనాలు నిర్మించారు. అవి పట్టణానికి సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడకు వెళ్లిరావడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని అప్పట్లోనే పట్టణవాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ప్రత్యక్ష ఆందోళనలకూ దిగారు. అయినా ప్రజాప్రతినిధులు అక్కడే కార్యాలయాల భవనాలు నిర్మించడానికి మొగ్గుచూపారు. తీవ్ర నిరసనల మధ్యే పనులు పూర్తయి ఆఫీసులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రతీ పనికి 3 కి.మీ. ప్రయాణం..

➜ పట్టణవాసులు తమ అవసరాల కోసం నిత్యం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లేందుకు మూడు కిలో మీటర్లు ప్రయాణం చేస్తున్నారు.

➜ ఇంతకష్టపడి వెళ్లినా.. అక్కడ సకాలంలో పనులు పూర్తికావడం లేదు.

➜ మహిళలు, వృద్ధులు అంతదూరం వెళ్లడానికి ఇబ్బందులు పడడం, ఆటోల చార్జీ చెల్లించడం సమస్యగా మారింది.

ఆరు గుంటలు.. కోటిన్నర రూపాయలు..

పట్టణ నడిబొడ్డున ఉన్న ఎస్సారెస్పీ అధీనంలోని ఆరు గుంటలను తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల భవన నిర్మాణం కోసం ఇటీవల కేటాయించారు. ఇందుకోసం సుమారు రూ.1.50కోట్లు వెచ్చిస్తారని అంచనాలు తయారు చేశారు. తొలిదశలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ఇటీవల రూ.30 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రగతి దశకు చేరగానే మిగిలిన నిధులు కేటాయిస్తారు. పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో నిర్మాణం కొనసాగనున్నారు. సుమారు ఆరు నెలల వ్యవధిలో భవన నిర్మాణం పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా కొనసాగిస్తున్నారు.

వేగంగా పనులు

పట్టణం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలోని ఆదర్శనగర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఉండేది. అంత దూరం వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. వారికి ఆఫీసులను అందుబాటులో తీసుకురావాలని నిర్ణయించాం. తొలిదశలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేయించాం. సుమారు పక్షం రోజుల క్రితం భవన నిర్మాణానికి భూమిపూజ చేశాం. మిగిలిన నిధులు త్వరలో మంజూరు చేయిస్తాం. పనులు త్వరితగతిన పూర్తిచేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తాం.

– కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే, కోరుట్ల

బీర్‌పూర్- సారంగాపూర్ మధ్య
రాకపోకలు షురూ



పదిరోజుల క్రితం : అప్రోచ్ రోడ్డుపై వరద ప్రవాహం



ప్రస్తుతం : తాత్కాలికంగా నిర్మించిన అప్రోచ్‌రోడ్డు

- అందుబాటులోకి అప్రోచ్‌రోడ్డు
- రెండు జిల్లాల మధ్య సులభమైన ప్రయాణం
- తొలగిన ప్రయాణికుల పదిరోజుల ఇబ్బందులు

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతోపాటు మంచిర్యాల జిల్లా జన్నారం తదితర ప్రాంతాలకు కోనాపూర్ వాగు పైనుంచి శుక్రవారం రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. దాదాపు 10 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల తిప్పలు తొలగిపోయాయి. కోనాపూర్ వాగుపై ఆర్ అండ్ బీ అధికారులు హైలెవల్ వంతెన నిర్మిస్తున్నారు. అయితే, పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ప్రత్యామ్నాయంగా వాగు పక్కన పైపులు వేసి అప్రోచ్ రోడ్డు నిర్మించారు. పదిరోజుల క్రితం కురిసిన భారీవర్షాలతో అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ప్రజలు ఇతర మార్గాలు ఎంచుకున్నారు. ఇవి అధిక ప్రయాసలతో కూడుకున్నవి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు.. తాత్కాలికంగా మళ్లీ అప్రోచ్ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటి తేలికపాటి వాహనాలు రాకపోకలకు సాగిస్తున్నాయి. శనివారం నుంచి బస్సులు, ఇతర భారీవాహనాలు నడిచేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

21న మద్యం దుకాణాలకు డ్రా

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్



మాట్లాడుతున్న శ్రీధర్

జగిత్యాలక్రైం: జిల్లాలోని మద్యం దుకాణాలను ఈనెల 21న డ్రా పద్ధతిన కేటాయిస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023–25 ఆర్థిక సంవత్సరాలకు గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఇందుకోసం ధరూర్ క్యాంపులోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో మూడు కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 71 షాపులు ఉన్నాయని, ఇందులో గౌడ కులస్తులకు 14, ఎస్సీలకు 8 కేటాయించగా, మిగిలిన మద్యం దుకాణాలు జనరల్ కేటగిరీలో ఉన్నాయని వివరించారు. జగిత్యాల సర్కిల్‌లోని 32 షాపుల్లో గౌడ కులస్తులకు 10, ఎస్సీలకు 3, ధర్మపురి సర్కిల్‌లోని 14 షాపుల్లో గౌడ కులస్తులకు 2, ఎస్సీలకు 1, మెట్‌పల్లి సర్కిల్‌లోని 25 షాపుల్లో గౌడ కులస్తులకు 2, ఎస్సీలకు 4 షాపులు రిజర్వ్ చేశామని చెప్పారు. ఒక్కో దరఖాస్తుదారు రూ.2లక్షల ధరావతు చెల్లించాలని, దీనిని వాపసు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈనెల 21న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో డ్రా పద్ధతిన నిర్వాహకులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రభాకర్ రెడ్డి, ముత్యం పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోకు రూ.1.50 కోట్ల నష్టం

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ



పెద్దవాగు పరిసరాల్లో ట్రాన్స్‌కో అధికారులు

మల్లాపూర్(కోరుట్ల): భారీ వర్షాలతో ట్రాన్స్‌కోకు సుమారు రూ.1.50 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. పలు గ్రామాల్లో ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను డీఈ గంగరాంతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వరదల ధాటికి జిల్లావ్యాప్తంగా 1,143 విద్యుత్ స్తంభాలు విరిగాయని, 89 ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునిగాయని అన్నారు. మల్లాపూర్ సబ్ డివిజన్ రాఘవపేట, సెక్షన్ పరిధిలో 158 విద్యుత్ స్తంభాలు, 11 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై దాదాపు రూ.40లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వీటిస్థానంలో కొత్తవి అమర్చుతామని చెప్పారు. అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు శ్రమించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ధ్వంసమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి బిగిస్తామని చెప్పారు. విధి నిర్వహణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది సేవలను గుర్తించి, భవిష్యత్‌లో చేపట్టే పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాస్‌రావు, ఏఈలు వినీత్‌కుమార్‌రెడ్డి, శివకుమార్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

కథలాపూర్(వేములవాడ): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆవరణలో తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డుప్రమాదాలు సాయంత్రం వేళల్లో జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. సాయంత్రం వేళల్లో డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. గతేడాదితో పోల్చుకుంటే జిల్లాలో నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతోనే ఇదీ సాధ్యమైందని వివరించారు. గంజాయి విక్రయాలు, తాగుతున్నవారి వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించి శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భూ సమస్యలపై బాధితులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని, వాటిని రెవెన్యూ అధికారుల వద్ద పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు సమస్యలపై ఠాణాకు వస్తే 24 గంటలు అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. సైబర్ నేరాలు కాస్త పెరిగాయని, బాధితులు 1930 నంబబర్‌కు ఫోన్ చేస్తే డబ్బులు రికవరీ అవుతాయని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కథలాపూర్ ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రాజమణి

ధర్మపురి: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. మగ్గిడి (గొల్లపల్లి) గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జూలై 30న మెట్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అక్కడ ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో జి.రామ్‌తేజ, బి.హర్షవర్ధన్, టి.రిషి వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీలు సంతోష్, శ్రీనివాస్ అభినందించారు.

ఠాణా ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- కూతురుకు న్యాయం జరగడం లేదని అఘాయిత్యం



పురుగుల మందు తాగుతున్న కనకలక్ష్మి

గొల్లపల్లి(ధర్మపురి): తన కూతురిని వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదనే మనస్తాపంతో స్థానిక నల్లగుట్టకు చెందిన దండ్ల కనకలక్ష్మి శుక్రవారం రాత్రి ఠాణా ఎదుట పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. దండ్ల కనకలక్ష్మి – నగేశ్ దంపతుల కూతురు స్వరూపను కోరుట్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపారు. అల్లుడు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడే ఓ వ్యక్తి ఆమెను లైంగికంగా వేధించడంతో తన ఇంటికి తీసుకొచ్చుకున్నారు. ఇక్కడ కూడా ఓ వ్యక్తి వివాహితను లైంగికంగా వేధించాడు. దీంతో తన కూతురును తీసుకుని 20రోజుల క్రితం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేయాల్సిన ఎస్సై.. తల్లీబిడ్డలతో దురుసుగా మాట్లాడారు. కేసు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రోజుల తరబడి ఠాణా చుట్టూ తిప్పించుకోవడంతోపాటు కొంత డబ్బు కూడా డిమాండ్ చేశారు. విసిగి వేసారిన కనకలక్ష్మి శుక్రవారం రాత్రి పురుగుమందుల డబ్బాతో పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. తన కూతురు న్యాయం జరగడం లేదని పేర్కొంటూ పురుగుల మందు తాగింది. అప్రమత్తమైన పోలీసులు 108 వాహనంలో జగిత్యాలలోని జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా.. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అయినా, అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల ఆరోపణల్లో వాస్తవం లేదని వివరించారు.

‘సుప్రీం’ తీర్పు న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచింది

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాలటౌన్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దుపై సుప్రీంకోర్టు స్టే విధించడం కేంద్రప్రభుత్వ నియంతృత్వ పాలనకు చెంపపెట్టు లాంటిదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ శ్రేణులు జిల్లా కేంద్రంలో శుక్రవారం బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. విజయలక్ష్మి ఆధ్వర్యంలో తొలుత ఇందిరాభవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సమావేశాలకు వస్తున్నారు.. జాగ్రత్త అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతుకలను అణిచే వేసే కుట్రలో భాగంగా రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, చందా రాధాకిషన్, మారు గంగారెడ్డి, గుండ మధు, నేహాల్, చాంద్‌పాషా, చిట్ల అంజన్న, రజనీకాంత్, తోట నరేశ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక భావం పెంపొందించాలి

జగిత్యాల: అందరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సూచించారు. టౌన్‌హాల్‌లో బ్రహ్మకుమారి ఉమెన్ వింగ్స్ ఆధ్వర్యంలో ‘కుటుంబాన్ని సమర్థవంతంగా చేద్దాం’ అంశంపై శుక్రవారం ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ, మహిళలు చైతన్యవంతులు కావాలని కోరారు. బ్రహ్మకుమారి శ్రీలత మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు అశ్విని, గౌతమి, హేమలత, డీఎంసీ రజిత, సఖి బృందం, చైల్డ్‌లైన్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ప్రశాంతంగా ఉండాలి

బ్రహ్మకుమారీస్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ‘సెల్ఫ్ ఎంపవర్మెంట్ .. మహిళా స్వశక్తీకరణ’ అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిస్థితులు బాగుంటేనే ఊరు బాగుంటుందని అదనపు కలెక్టర్లు అన్నారు. వీటిద్వారానే దేశం బాగుంటుందని చెప్పారు. అధికారులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ దేశాల్లోని కార్మికుల సంక్షేమం కోసం రూ.500కోట్లతో బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. వీవీరావుపేటలో శుక్రవారం నిర్వహించిన గల్ఫ్ కార్మికుల అవగాహన చైతన్యయాత్రలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువత ఉన్న ఊరిలో పనిలేక ఉపాధి కోసం ఎడారి దేశాలకు వలస వెళ్తోందన్నారు. పరాయిదేశంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏటా విదేశీ మారకద్రవ్యం రూపంలో రూ.వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్నా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. గల్ఫ్ కార్మికుల పేర్లను రేషన్‌కార్డుల్లోంచి తొలగించడం బాధాకరమన్నారు. అనంతరం గల్ఫ్ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న తీరు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వీవీరావుపేట గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు పెనుకుల అశోక్, ఉపసర్పంచులు కోడిమ్యాల రవి, వెల్మల రాజన్నయ్య, నాయకులు ఆరెల్లి సంజీవ్, పెనుకుల నరేశ్, లింగాల తిరుపతి, కొత్తపల్లి రాజశేఖర్, రఘు, శ్రీకాంత్, దశరథం, వంశీ, మానస, రాణి, కరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులకు బదిలీలు సహజం



డీఎస్పీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

జగిత్యాల రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న డీఎస్పీ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహించినా అంకిత భావంతో పనిచేయాలని, పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాపర్ వైర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ సతీశ్

ఇబ్రహీంపట్నం : మండలంలోని గొధూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి రూ.30వేల నష్టం వాటిలినట్లు ఆయన తెలిపారు. కాపర్‌వైర్ చోరీకి పాల్పడటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ సతీశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన లక్ష్మణ్

ధర్మపురి : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలుకాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఏఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం .. ధర్మపురి శివారులోని దమ్మన్నపేట వెళ్లే రోడ్డులో శుక్రవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో మండలంలోని జైనా గ్రామానికి చెందిన గుర్రాల లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలుకాగా చిన్న నక్కలపేట గ్రామానికి చెందిన కామెర కల్యాణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బహిరంగ వేలం

జగిత్యాల: పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరఆలయ ధర్మశాలకు సంబంధించి సర్వేనెం.171లో గల భూమిలో మూడునెలల కాలపరిమితితో ఎగ్జిబిషన్ నిర్వహణకు లీజుకిచ్చేందుకు ఈనెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 1 నుంచి నవంబర్ 30 వరకు ఎగ్జిబిషన్ నిర్వహణకు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.లక్ష డిపాజిట్‌తో పాల్గొనాలన్నారు.

నిబంధనలు గాలికి..





ఓ రెస్టారెంట్‌లో అపరిశుభ్రంగా ఉన్న వంటగదిని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు, రెస్టారెంట్‌లో కుళ్లిన పదార్థాలు

- బార్ అండ్ రెస్టారెంట్‌లో నాణ్యత లేని ఆహారం
- ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- జిల్లాలో ప్రజారోగ్యంతో చెలగాటం
- అధికారుల తనిఖీలు శూన్యం

జగిత్యాల: ఈనెల 2న జగిత్యాలలోని నిజామాబాద్ రోడ్డులో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. అందులో కుళ్లిన చికెన్‌తో పాటు, ఇతర ఆహార పదార్థాలు బయటపడ్డాయి. వెంటనే వాటిని మట్టిలో పూడ్చి వేసి రెస్టారెంట్‌కు జరిమానా విధించారు. అధికారులు తనిఖీ చేయకపోవడం వల్ల నాణ్యత లేని ఆహారం అందించడం జిల్లాలో పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు నిత్యం తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు గాలికి..

ప్రజల నుంచి వందలాది రూపాయలు దండుకుంటున్న బార్‌అండ్ రెస్టారెంట్ యజమానులు ఆహార పదార్థాల విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో రెస్టారెంట్లు, హోటల్స్, బార్లలో కుళ్లిపోయిన ఆహార పదార్థాలు వినియోగదారులకు వడ్డిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రజలు సైతం మత్తులో ఉండటంతో వాటినే ఆరగిస్తున్నారు. హోటళ్లలో నిబంధనలు గాలికొదిలేసి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నారు. బల్దియా, ఆహారభద్రత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు ఆహారభద్రత శాఖ అధికారి ఒకరే ఉండటం, మున్సిపల్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. సుమారు 500 హోటల్స్, టిఫిన్ సెంటర్లు, 20 రెస్టారెంట్లు, 10 వరకు దాబాలు సైతం ఉన్నాయి. దాదాపు అన్ని చోట్ల నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి.

ధరలు ఎక్కువ.. నాణ్యత తక్కువ

జిల్లా కేంద్రం కావడంతో గతంలో కంటే ఇప్పుడు రాకపోకలు మరింత పెరిగాయి. హోటళ్లకు గిరాకీ పెరగ్గా బార్‌అండ్ రెస్టారెంట్లలో నిత్యం బారులు తీరుతుంటారు. కలుషితమైన ఆహారం వడ్డించడం, రెస్టారెంట్లలో రెండు మూడురోజుల పాటు నిల్వచేసిన ఆహారాన్ని వడ్డిస్తున్నట్లు మున్సిపల్ అధికారుల దాడుల్లో తేట తెల్లమైంది. ధరల విషయంలో రాజీపడని యజమానులు నాణ్యత మాత్రం పాటించడం లేదు. చికెన్, మటన్ బిర్యానీలకు రూ.300లకు పైగా ధరలు వసూలు చేస్తున్నారు. మాంసాన్ని వ్యాపారుల నుంచి తక్కువ ధరలో కొనుగోలు చేయడంతో పాటు వాటిని నూనెలో గోలించి ముందుగానే ఫ్రిజ్‌లో పెడుతున్నారు. గిరాకీ లేక ఎన్ని రోజులైనా అందులోనే ఉంచి వచ్చిన వారికి వడ్డిస్తున్నారు. సాధారణంగా వైన్స్‌లో కంటే రెస్టారెంట్లలో ఎక్కువ ధరలు వసూలు చేస్తుంటారు. సిట్టింగ్ ఉండటంతో పాటు అన్ని మౌలిక వసతులు ఉండటంతో ఆహారం, వైన్స్ విషయంలో అధిక రేట్లు వసూలు చేస్తుంటారు. కానీ నిబంధనలు పాటించడంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. మాంసం, చట్నీ వంటివి ఫ్రిజ్‌లో కొన్నిరోజులు నిల్వ ఉంచి దుర్వాసన వచ్చినా వాటిని నూనెలో ఫ్రై చేసి ప్రజలకు అంటగడుతున్నారు. కొన్ని చోట్ల నాసిరకం నూనె వాడుతున్నారనే ఆరోపణలున్నాయి.

నిబంధనలివే..

- ఏ రోజు పదార్థాలు ఆరోజే విక్రయించాలి.
- ఒకసారి వినియోగించిన నూనెను మరోసారి వాడకూడదు.
- భోజనం తయారుచేసే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి.
- వినియోగదారులు మిగిల్చిన ఆహారం వెంటనే పడేయాలి.
- ఆహార పదార్థాలు, మాంసం మిగిలితే వాటిని రసాయనాలు వినియోగించి ఫ్రిజ్‌లో పెట్టొద్దు.

నాణ్యమైన ఆహారం అందించాలి

నిత్యం తనిఖీలు చేస్తున్నాం. హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో వినియోగదారులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ఆహారం అందించాలి. వంటగది తప్పకుండా పరిశుభ్రంగా ఉంచాలి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి మున్సిపల్ లైసెన్స్ ఉండాలి.

– బాల ఎల్లం, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, జగిత్యాల

సుంకరి ఈనాం భూములు పేదలకు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్ : మండలంలోని శాఖాపూర్‌లో సుంకరి ఈనాం భూములు అర్హులైన దళిత పేదలకు అందించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనెంబర్ 27, 39, 42లోని సుమారు 21 ఎకరాల 17 గుంటల భూమిని నిజాం ప్రభుత్వ హయాంలో పేదలు, దళితులకు సుంకరి ఈనాం భూములిచ్చిందని, ఓఆర్‌సీ సర్టిఫికెట్ పొందిన పేదలు పట్టాలు పొందాల్సి ఉన్నా కొందరు భూమిని ఆక్రమించారన్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు నాయకులు అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. అక్రమ పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఈ భూములు చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయంలో చోరీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారు మర్రివ్వ ఆలయంలో చోరీ జరిగినట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఆలయంలో చొరబడి హుండీలోని డబ్బులు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కలవరపెడుతున్న కళ్లకలక

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు

రాయికల్: జిల్లాలో కళ్లకలక విస్తృతంగా వ్యాపిస్తోంది. నల్లని కళ్లద్దాలు పెట్టుకొని కనిపిస్తే.. వారికి కళ్లకలక సోకిందని అనుమానిస్తున్నారు. వారి వద్దకు వెళ్లడానికే జంకుతున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే అందరికీ వ్యాపిస్తోంది. వైద్య పరిభాషలో కంజెక్టవిటీస్ ఐ ఫ్లూ గా వ్యవహరించే ఈ అంటువ్యాధి.. వైరస్ కారణంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తోంది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా అన్ని వయసుల వారు కళ్లకలకతో బాధ పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ బాధితులు వరుస కడుతున్నారు. వర్షాలు, వరదలు చోటుచేసుకున్నప్పుడు ఈవ్యాధి ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది.
- చల్లని నీటితో కళ్లు తరచూ కడుక్కోవాలి.
- కళ్లను రుద్దకుండా ఉండాలి. ఇతరులకు సోకకుండా కళ్లద్దాలు ధరించాలి.
- కళ్లు మసకబారితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- తరచూ చేతులను సబ్బు/ శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి.
- కళ్లను చేతులతో తరచూ తాకరాదు.
- బాధితులు వాడిన రుమాళ్లు కుటుంబంలోని ఇతరులు వాడొద్దు.
- పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- రద్దీ ప్రదేశాలకు వెళ్లవద్దు



లక్షణాలతో ఉన్న కళ్లు

ఇవి లక్షణాలు..

- కళ్లు ఎర్రగా మారి కనురెప్పలపై వాపు వస్తుంది.
- కళ్లు దురద పెడుతుంటాయి, మంటగా ఉంటుంది.
- కళ్లల్లో ఇసుక పడినట్లు గరగరలాడుతూ ఇబ్బంది పెడుతాయి.
- పిల్లలకు జ్వరం వచ్చే అవకాశం ఉంది.
- కళ్లకు బూసులు వస్తుంటాయి. పడుకొని లేచేటప్పటికి కనురెప్పలు అంటుకుపోతాయి.

ఆందోళన అవసరం లేదు



వాతావరణ మార్పులతో కళ్లకలక వస్తోంది. దీనిద్వారా పెద్దప్రమాదం ఏమీ ఉండదు. వారంరోజుల్లో దానికదే తగ్గిపోతుంది. వైరస్‌కు తోడు బాక్టీరియా ప్రభావం చూపితే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి. పరిశుభ్రత పాటించడంతోపాటు ఇతరులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో వ్యాధి బారిన పడిన వారు ఇతరులకు దూరంగా ఉండాలి. స్వీయ నియంత్రణ పాటించాలి.

– శ్రీనివాస్ డిప్యూటీ డీఎంహెచ్‌వో

స్నేహితుడిని చంపిన వ్యక్తికి యావజ్జీవం

జగిత్యాలజోన్ : స్నేహితుడిని చంపిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమా శుక్రవారం తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మాలవాడ (అంబేద్కర్ నగర్)కు చెందిన తోట్ల అభిలాష్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మే.12, 2018న వార్డులో ఓ వివాహం జరిగింది. అనంతరం అభిలాష్‌తో పాటు శ్రీరామ్ తేజ, కొందరు మద్యం తాగారు. స్నేహితుల మధ్య గొడవ జరగ్గా పెద్దలు సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనవసరంగా తమను తిట్టారంటూ అభిలాష్ స్నేహితుడు కిరణ్‌తో కలిసి పెళ్లి పెళ్లివేడుక జరిగిన ఇంటికి వెళ్లారు. అక్కడే ఉన్న శ్రీరామ్ తేజ, అలమద్రి కిశోర్, తమ్మాటి రమణ, తమ్మాటి వెంకటేశ్‌లు అభిలాష్ కిరణ్‌ను కత్తితో పొడిచారు. స్థానికులు ఇద్దరిని చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అభిలాష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు తోట్ల మధుమోహన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ, డీఎస్పీ ప్రకాశ్ కేసు దర్యాప్తు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం. కిరణ్‌కుమార్, శ్రీనివాస్ సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టారు. నిందితుల్లో మొదటి ముద్దాయిగా ఉన్న ఎలమద్రి శ్రీరామ్ తేజకు జీవిత ఖైదు, కిషోర్, రమణ, వెంకటేశ్‌లను నిర్దోషులుగా జడ్జి తీర్పుచెప్పారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వెంకట్రావు



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కోరుట్ల రూరల్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు అన్నారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయడంపై శుక్రవారం మండలంలోని సంగెంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఉపసర్పంచ్ సాగరిక, రైతుబంధు సమితి అధ్యక్షుడు సుధవేణి భూమయ్య, మాజీ సర్పంచ్ జక్కని గణేశ్, వార్డుసభ్యుడు లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కొమ్ముల మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (27) అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై గజేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువతి గురువారం తాను చేసిన బీడీలను కంపెనీలో ఇచ్చేందుకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

5 నుంచి ధ్రువపత్రాలు అందజేయాలి

జగిత్యాల: తెలంగాణ డయాగ్నోస్టిక్‌లో కాంట్రాక్ట్ ప్రతిపాదికన మైక్రో బయాలజిస్ట్ (1), బయోకెమిస్ట్ (1), ఫార్మాసిస్ట్ (1) పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటిండెంట్ రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దరఖాస్తుల ప్రొవిజనల్ జాబితా జగిత్యాల అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను ఈనెల 5 నుంచి 8 వరకు స్థానిక జనరల్ ఆస్పత్రిలో అందించాలన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి ఒకరి మృతి



గాయపడిన సాగర్

జమ్మికుంట: ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఎనమనగండ్ల సాగర్(38) వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి టిఫిన్ చేసేందుకు బైక్‌పై హోటల్‌కు వెళ్లాడు. వాహనానికి స్టాండ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతని తల అక్కడే ఉన్న సిమెంట్ స్తంభానికి బలంగా తగలడంతో తీవ్ర గాయమైంది. చుట్టుపక్కలవారు గమనించి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఏడేళ్ల క్రితం చనిపోగా ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ



తిమ్మాపూర్: లారీ ఢీకొని, ఓ కారు ముందు భాగం దెబ్బతినగా.. కారులో ఉన్న ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు శుక్రవారం తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. తిరిగి వెళ్లే క్రమంలో స్థానికంగా యూటర్న్ తీసుకుంటుండగా గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో నుస్తులాపూర్ వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, కారును పక్కకు తీయించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో కరీంనగర్ కోర్టు జడ్జి ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మద్యం తాగి, వాహనాలు నడిపిన 12 మందిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో తిమ్మాపూర్ మండలానికి చెందిన మాతంగి రాజుకు 10 రోజుల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా, మిగతా 11 మందికి రూ.22,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట శివారు హుస్సేన్ మియావాగు వద్ద ఉన్న వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నట్లు తెలిపారు. ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలకు 87125 56506, 87125 56507 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి !



సమీర్ (ఫైల్)

కోరుట్ల : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని భీమునిదుబ్బ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని భీమునిదుబ్బ ప్రాంతంలో నివాసముండే ఎండీ. సమీర్ (25) పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండ్రోజుల క్రితం అదే ఆస్పత్రిలో పనిచేసే తన స్నేహితుడి బైక్‌పై డి-40 కాలువ వద్దకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడు. కొద్ది సేపటికే సమీర్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. కుటుంబ సభ్యులు, బంధువులు రెండ్రోజుల నుంచి గాలించగా శుక్రవారం వెంకటాపూర్ శివారులోని ఇటుక బట్టీల ప్రాంతంలో డి-40 కాలువలో సమీర్ మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారణ చేపట్టారు. సమీర్‌కు స్థానికంగా ఓ మహిళతో సాన్నిహిత్య సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. మృతుడి బావ అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.


వృద్ధుడి ఆత్మహత్య

కథలాపూర్(వేములవాడ): భీమారం మండలం ఈదుల లింగంపేటకు చెందిన ఇట్టెడి లింగారెడ్డి (80) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లింగారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై హసన్ మహ్మద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లపల్లి: జగిత్యాల చిలుకవాడ ప్రాంతానికి చెందిన అబ్దుల్ అజిత్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. అబ్దుల్ అజిత్ సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని శ్రీ రాములపల్లి గ్రామంలోని గాజుల శ్రీనివాస్ ఇంటికి ఈనెల1న పని చేసేందుకు వెళ్లాడు. సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడ్డాడు. తలకు గాయాలుకాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న ధాన్యం

సుల్తానాబాద్‌రూరల్: రైస్‌మిల్ నుంచి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం రాత్రి సివిల్ సప్లై అధికారులు పట్టుకొని సీజ్‌చేశారు. సివిల్ సప్లై ఉప తహసీల్దార్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్నపల్లి పరిధిలోని సిరి రైస్‌మిల్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మర పట్టించి ఇచ్చేందుకు ధాన్యాన్ని కేటాయించారు. రైస్‌మిల్ యజమాని ఎలాంటి అనుమతి లేకుండా హుజూరాబాద్‌కు ఓ ట్రేడ్ లైసెన్స్ హోల్డర్ ద్వారా ఏపీ 24వై 4530గల లారీలో దాదాపు 27క్వింటాళ్ల ధాన్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు చెప్పారు. ఇక్కడ సివిల్ సప్లై అధికారి రవీందర్, తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు వెంచర్ల కోసం ప్రముఖ సంస్థకు తక్షణం కావలెను. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తక్షణం సంప్ర : 9948801113 [HA-30033]

SERVICES

స్వయం ఉపాధితో జీవితంలో స్థిరపడాలి అనుకునే వారు నిరాశతో ఉన్న యువతకు పెట్టుబడి కొరకు లక్ష నుండి లక్షల వరకు ఋణాల సలహాలు ఇవ్వబడును. పాత కరీంనగర్. ఫోన్ : 7989671278. [H-796925]

మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు, CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

LOANS

సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189119]

OLD AGE HOME

త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి,వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును .ఫోన్: 9160900023, 9160900024 [H-189316]

BUSINESS OFFER

RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana -2.5L. 50Kg's vacuum packed prawns/ day. Rs.600/kg pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433 [WB-19219]

WANTED

I to V E/M పాఠశాలలో పని చేయుటకు టీచర్స్ కావలెను. & B.Sc.(Maths) ట్రెయిన్డ్/ అన్‌ట్రెయిన్డ్ టీచర్ కావలెను. వేతనము, ఉచిత భోజన వసతి కల్పించబడును. సెల్: 9247868856, 9440006446. [K-1217235]

మహిళలకు పర్మినెంట్ వర్క్: క్రాఫ్ట్ వర్క్ నేర్పించి జీతం 10-15 వేలు ఇవ్వబడును. నాన్‌లోకల్ వారికి ప్రాధాన్యం, ఫ్రీ అకామిడేషన్. కరీంనగర్. సెల్: 7981382531 [K-1217177]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221479]

ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V-6204]

కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 7993700904, 9014504770, 8977743043. [W-1002992]

INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786475]

బీకాం డిగ్రీ అకౌంట్స్, టాలీ ఇయర్ పి 9, MS ఆఫీస్, MS ఎక్సెల్, ఫ్రెషర్ or ఎక్స్‌పీరియన్స్ కలిగిన వారు మరియు నెట్‌వర్కింగ్, హార్డ్‌వేర్, సోషల్ మీడియా, సీసీ టీవీ, ఇంటర్ కం. వర్క్ వచ్చినవారు మూడు సంవత్సరాల కాంట్రాక్ట్ కొరకు ఆఫ్రికా దేశంలో పనిచేయుటకు కావలెను. ఫోన్ : 9666653527 [H-189274]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-189314]

Urgently Required Plumber, Electrician, Cooking Master, House Keeping Boys and Telecallers for Hotel Ph: 8309909633, 8637338326, 7893174029 [HA-481]

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.